ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
24 ఫిబ్రవరి
2025



# స్వయంభూ నారసింహుడికి స్వర్ణగోపుర శోభ


**వైభవంగా దివ్యవిమాన స్వర్ణగోపుర 'మహాకుంభ సంప్రోక్షణ**

**స్వర్ణగోపురాన్ని ఆవిష్కరించి సంప్రోక్షణ పూజలు చేసిన సీఎం రేవంత్ రెడ్డి దంపతులు**

**నదీజలాలతో కుంభ సంప్రోక్షణ చేసి స్వర్ణగోపురాన్ని నర్సన్నకు అంకితం చేసిన సీఎం**

**దేశంలోనే ఎత్తైన స్వర్ణగోపురంగా చరిత్ర పుటల్లోకి నర్సన్న విమాన గోపురం**





యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: రాష్ట్ర ప్రజలతో పాటు యావత్ దేశప్రజలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసిన స్వర్ణగోపుర కల సాక్షాత్కారం అయింది. ఆదివారం సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా యాదగిరిగుట్ట నారసింహుడి స్వర్ణగోపురం ఆవిష్కృతం అయింది. స్వర్ణగోపురానికి ఏర్పాటు చేసిన పరదాలను సీఎం రేవంత్ రెడ్డి కిందికి దించి దివ్యవిమాన స్వర్ణగోపురాన్ని ఆవిష్కరించారు. అనంతరం మహాకుంభాభిషేక సంప్రోక్షణ పూజలు చేసి దివ్యవిమాన స్వర్ణగోపురాన్ని స్వామివారికి అంకితం చేశారు. వానమామలై పీఠాధిపతి రామానుజ జీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఆలయ ప్రధానార్చకులు నల్లంతిఘల్ లక్ష్మీనరసింహాచార్యులు, కాందూరి వెంకటాచార్యుల అర్చకత్వంలో అర్చకులు మహాకుంభ సంప్రోక్షణను అంగరంగ వైభవంగా నిర్వహించారు. సరిగ్గా ఉదయం 11:54 గంటలకు మూల నక్షత్రం, వృషభ లగ్నంలో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా సంప్రోక్షణ జరిపి దివ్యవిమాన స్వర్ణగోపురాన్ని ఆవిష్కరించారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి సతీసమేతంగా గర్భగుడిలో స్వయంభూ నారసింహుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొదట ఆలయానికి చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డి.. నేరుగా కొండపైన ప్రధానాలయ ఈశాన్య దిశలో ఏర్పాటు చేసిన యాగశాలకు చేరుకుని మహాపూర్ణాహుతిలో పాల్గొన్నారు. అనంతరం ఉత్తర రాజగోపురం నుండి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మెట్ల మార్గం గుండా దివ్యవిమాన స్వర్ణగోపురంపైకి చేరుకుని మహాకుంభ సంప్రోక్షణ పూజల్లో పాల్గొన్నారు. ఉదయం 11.33 నుండి 11:56 గంటల వరకు స్వర్ణమయమ సుదర్శన చక్రానికి మంత్రవేష్టితమైన పవిత్ర, శుద్ధ నదీజలాలతో కుంభ సంప్రోక్షణ పూజలు నిర్వహించారు. అనంతరం త్రితల గోపురం నుండి ప్రధానాలయంలోకి చేరుకుని గర్భగుడిలో స్వయంభూ నారసింహుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు వేదాశీర్వచనం చేయగా.. ఆలయ ఈవో భాస్కర్ రావు లడ్డూప్రసాదం, స్వామివారి శేషవస్త్రాలు అందజేసి నారసింహుడి ఫొటోను బహూకరించారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి.. రోడ్డు మార్గంలో హైదరాబాద్ వెళ్లారు. సీఎం రేవంత్ రెడ్డి వెంట సీఎస్ శాంతికుమారి, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యేలు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, బాలు నాయక్, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కలెక్టర్ హనుమంతరావు, వైటీడీఏ వైస్ చైర్మన్ కిషన్ రావు, ఆలయ ఈవోఎన్. భాస్కర్ రావు, మహిళా అభివృద్ధి కార్పొరేషన్ చైర్ పర్సన్ బండ్రు శోభారాణి, తెలంగాణ డెయిరీ డెవలప్‌మెంట్ చైర్మన్ అమిత్ రెడ్డి తదితరులు ఉన్నారు.





## దేశంలో ఎత్తైన స్వర్ణగోపురంగా

యావత్ దేశంలోనే ఎత్తైన స్వర్ణగోపురంగా యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి పంచతల దివ్యవిమాన గోపురం చరిత్ర లిఖించింది. 50.5 అడుగులు ఎత్తు, 10,754 స్క్వేర్ ఫీట్ల వైశాల్యం ఉన్న స్వామివారి పంచతల దివ్యవిమాన గోపురం.. 65 కిలోల 633 గ్రాముల బంగారంతో స్వర్ణమయం అయింది. దేశంలో కొన్ని ఆలయాలకు ఉన్న స్వర్ణగోపురాలు త్రితల(మూడు అంతస్తులు) గోపురాలు మాత్రమే కాగా.. యాదగిరిగుట్ట నారసింహుడి స్వర్ణగోపురం మాత్రమే పంచతల(ఐదంతస్తులు) గోపురంగా చరిత్ర పుటల్లోకి ఎక్కింది. దేశంలో ఐదంతస్తుల స్వర్ణగోపురం ఉన్న ఏకైన క్షేత్రంగా యాదగిరిగుట్ట నారసింహుడి దేవస్థానం రికార్డు సృష్టించింది. కాగా స్వామివారి దివ్యవిమాన గోపురాన్ని స్వర్ణమయం చేయడం కోసం ప్రభుత్వం భక్తుల నుండి విరాళాలు సేకరించింది. దాతల ద్వారా వచ్చిన బంగారం, నగదు కలిపి 31 కిలోల 974 గ్రాముల 105 మిల్లీగ్రాముల బంగారం సమకూరగా.. 33 కిలోల 659 గ్రాముల బంగారం యాదగిరిగుట్ట దేవస్థానం ఖరీదు చేసింది. స్వర్ణగోపురం కోసం మొత్తం 65 కిలోల 633 గ్రాముల 105 మిల్లీగ్రాముల బంగారం పట్టింది. స్వర్ణతాపడం తయారీ పనులు, మరోవైపు రెడీ అయిన స్వర్ణతాపడాలను విమాన గోపురానికి బిగించే పనులు ఏకకాలంలో జరిగాయి. 2024 డిసెంబర్ 4 నుండి మొదలై 2025 ఫిబ్రవరి 15 వరకు.. కేవలం 74 రోజుల్లోనే స్వర్ణగోపురం పనులు పూర్తయ్యాయి. స్వర్ణతాపడం తయారీ, బిగింపు కోసం దాదాపుగా రూ.10.05 కోట్ల ఖర్చు అయిందని, స్వర్ణతాపడం తయారీ, బిగింపు పనులు చెన్నైకి చెందిన మెసర్స్ స్మార్ట్ క్రియేషన్స్, మహాబలిపురానికి చెందిన మెసర్స్ నవజీవన్ మెటల్ కల్చర్ అనే సంస్థలు చేశాయని ఆలయ ఈవో భాస్కర్ రావు వెల్లడించారు. దేశంలోనే యాదగిరిగుట్ట స్వర్ణగోపురం అత్యంత ఎత్తయినదిగా రూపుదిద్దుకుందని పేర్కొన్నారు.

## నదీజలాలతో స్వర్ణగోపురానికి కుంభాభిషేకం

దేశంలోని దాదాపుగా 60 నదుల నుండి సేకరించిన పుణ్య జలాలతో స్వర్ణమయమైన స్వామివారి దివ్యవిమాన గోపురానికి, స్వర్ణసుదర్శన చక్రానికి అర్చకులు కుంభాభిషేకం నిర్వహించారు. జనవరి 30న ఉప ప్రధానార్చకులు మాధవాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక అర్చక బృందం నదీజలాల సేకరణకు బయలుదేరి.. దేశంలోని గోదావరి, పెన్ గంగ, యమున, గంగ, ప్రయాగ్ రాజ్ త్రివేణీ సంగమం(గంగ, యమున, సరస్వతీ), సరయూ, గోమతి, నర్మదా, మంజీర, తాలిపేరు, హరిద్రా, కృష్ణా, తుంగ, భద్ర వంటి ముఖ్య నదులతో పాటు మొత్తం 60 నదుల నుండి పవిత్ర జలాలను సేకరించారు. వెండి కలశాలలో సేకరించి తెచ్చిన పవిత్ర నదీజలాలను యాగశాలలో ఏర్పాటు చేసిన కుంభంలో పోసి గత ఐదు రోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహించి మంత్రపూరితం గావించారు. మంత్రవేష్టితమైన పవిత్ర నదీజలాలతో ఆదివారం దివ్యవిమాన స్వర్ణగోపురానికి కుంభాభిషేకం, సంప్రోక్షణ చేశారు. మొదట వానమామలై రామానుజ జీయర్ స్వామి నదీజలాలతో కుంభ సంప్రోక్షణ చేయగా.. తర్వాత సీఎం రేవంత్ రెడ్డి మహాకుంభాభిషేక పూజలు చేసి దివ్యవిమాన స్వర్ణగోపురాన్ని స్వామివారికి అంకితం చేశారు.





ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
24 ఫిబ్రవరి
2025





# గుట్టలో 'సీఎం రేవంత్' రెండు గంటలు

## స్వర్ణగోపుర 'మహాకుంభ సంప్రోక్షణ'లో పాల్గొన్న సీఎం రేవంత్ దంపతులు

## ఉదయం 11 నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు గడిపిన సీఎం

యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్:
యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో.. ఆదివారం స్వామివారి దివ్యవిమాన స్వర్ణగోపుర ఉద్ఘాటనలో పాల్గొనడం కోసం యాదగిరిగుట్ట ఆలయానికి వచ్చిన సీఎం రేవంత్ రెడ్డి రెండు గంటలకు పైగా గడిపారు. మొదట హైదరాబాద్ నుంచి రోడ్డు మార్గంలో యాదగిరిగుట్ట చేరుకున్నారు. ఆదివారం ఉదయం 11:09 గంటలకు యాదగిరిగుట్టకు చేరుకుని డైరెక్టుగా కొండపైకి చేరుకున్నారు. లిఫ్ట్ ద్వారా ప్రధానాలయ ప్రాంగణానికి చేరుకుని.. అక్కడి నుండి ఈశాన్య దిశలో ఏర్పాటు చేసిన యాగశాలకు వచ్చారు. అక్కడ నిర్వహిస్తున్న పంచకుండాత్మక సుదర్శన నారసింహ యాగంలో సతీసమేతంగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుండి ప్రధానాలయ ఉత్తర రాజగోపురం నుండి అంతర మాడవీధుల్లోకి చేరుకుని.. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మెట్ల మార్గం గుండా దివ్యవిమాన గోపురంపైకి చేరుకున్నారు. ఉదయం 11:33 నుండి 11:56 గంటల వరకు స్వర్ణమయ విమాన గోపురం, సుదర్శన చక్రానికి నదీజలాలతో మహాకుంభాభిషేక సంప్రోక్షణ పూజలు నిర్వహించారు. అనంతరం స్వర్ణగోపురం పైనుండి కిందికి దిగిన సీఎం.. త్రితల గోపురం ద్వారా ప్రధానాలయంలోకి ప్రవేశించారు. మొదట క్షేత్రపాలకుడైన ఆంజనేయస్వామిని దర్శించుకుని, ముఖ మంటపంలో ఉన్న స్వర్ణ ధ్వజస్తంభానికి మొక్కి గర్భగుడిలోకి వెళ్లారు. గర్భాలయంలో స్వయంభూ నారసింహుడికి 15 నిమిషాల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు ఆయనకు వేదాశీర్వచనం చేయగా.. ఆలయ ఈవో లడ్డూప్రసాదం, స్వామివారి శేషవస్త్రాలు అందజేసి స్వర్ణగోపుర జ్ఞాపికను అందజేశారు. అనంతరం సప్తతల పశ్చిమ రాజగోపురం నుండి ఆలయం నుండి బయటకు వచ్చి లిఫ్టు ద్వారా వీఐపీ క్యాంప్ ఆఫీస్ కు వెళ్లారు. అక్కడ ఎమ్మెల్యేలు, ఎంపీ, ఉన్నతాధికారులతో కలిసి లంచ్ చేసిన సీఎం రేవంత్ రెడ్డి.. మధ్యాహ్నం 1.08 గంటలకు కాన్వాయ్ లో రోడ్డు మార్గంలో హైదరాబాద్ కు బయలుదేరి వెళ్లిపోయారు.

















### సీఎం రేవంత్ పర్యటన సాగిందిలా...

ఉదయం 11:09 గంటలకు.. యాదగిరిగుట్ట వైకుంఠ ద్వారానికి చేరుకున్నారు
11:11 గంటలకు.. ఘాట్ రోడ్డు మీదుగా కొండపైకి చేరుకున్నారు
11:14 గంటలకు.. ప్రొటోకాల్ ఆఫీస్ వద్ద సీఎంకు పలువురు స్వాగతం పలికారు.
11:20 గంటలకు.. లిఫ్ట్ ద్వారా ప్రధానాలయ ప్రాంగణానికి చేరుకున్నారు.
11:22 గంటలకు.. ఆలయ ఈశాన్య దిశలో ఉన్న యాగశాల వద్దకు చేరుకున్నారు.
11:22 నుండి 11:27 వరకు.. యాగశాలలో సతీసమేతంగా పూజలు నిర్వహించారు.
11:28 గంటలకు.. ఉత్తర రాజగోపురం నుండి మాడవీధుల్లోకి ప్రవేశించారు.
11:31 గంటలకు.. స్వర్ణగోపురం వద్దకు చేరుకున్నారు.
11: 32 గంటలకు.. విమాన గోపురానికి ఏర్పాటు చేసిన పరదాను తాడుతో లాగి స్వర్ణగోపురాన్ని ఆవిష్కరించారు
11:34 గంటలకు.. స్వర్ణవిమాన గోపురంపై ఉన్న సుదర్శన చక్రం వద్దకు చేరుకున్నారు.
11:43 గంటలకు.. మహాకుంభాభిషేక సంప్రోక్షణ పూజలు చేశారు.
11:47 నుండి 11:54 గంటల వరకు నదీజలాలతో సుదర్శన చక్రానికి కుంభాభిషేకం చేశారు.
11.59 గంటలకు.. త్రితల గోపురం నుండి ప్రధానాలయంలోకి ప్రవేశించారు.
మధ్యాహ్నం 12:02 గంటలకు.. గండభేరుండ నరసింహస్వామి, ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు.
12:03 గంటలకు.. స్వర్ణ ధ్వజస్తంభం చుట్టూ ప్రదక్షిణలు చేశారు.
12:05 గంటలకు.. గర్భగుడిలోకి వెళ్లి స్వయంభూ నారసింహుడిని దర్శించుకున్నారు.
12:26 గంటలకు.. సీఎం రేవంత్ కు ఈవో లడ్డూప్రసాదం, స్వర్ణగోపుర జ్ఞాపికను అందజేశారు.
12:32 గంటలకు.. పశ్చిమ రాజగోపురం నుండి బయటకు వచ్చారు.
12:35 గంటలకు.. లిఫ్ట్ ద్వారా వీఐపీ గెస్ట్ హౌస్ కు చేరుకున్నారు.
లంచ్ అనంతరం మధ్యాహ్నం 1.06 గంటలకు హైదరాబాద్ కు ప్రయాణమయ్యారు.

